


నీటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

ఆదివారం | 13 జూలై 2025 పేజీలు 8





జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి

## జిల్లాలో రైతులందరికీ

# సాగునీరు అందిస్తాం

- సీజనల్ పంటలపై అవగాహన కల్పించాలి
- రైతులు నీటిని వృధా చేయరాదు..
- రైతుల సమస్యల పై స్పందించాలి
- జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో మంత్రులు



నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ : నంద్యాల జిల్లాలో పంటలు సాగుచేసే ప్రతి రైతుకు సాగునీరు అందించి రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌళిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌లు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆధ్వర్యంలో జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మంత్రులతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తా జయసూర్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రులు బీసీ జనార్ధన్‌రెడ్డి, ఫరూక్‌లు మాట్లాడుతూ ఖరీఫ్ 2025-26 సంవత్సరానికి సంబంధించి నంద్యాల జిల్లాలో పంటలు సాగుచేసే ప్రతిరైతుకు సాగునీరు అందించి వారిని ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఏదైతే ఈ సీజన్‌కు ఇవ్వాల్సిన నీరు కెసి కెనాల్, ఎస్ఆర్‌బిసి, తెలుగుగంగ ప్రాజెక్టుల ద్వారా మిగతా ప్రాజెక్టుల ద్వారా మిగతా ప్రాంతాలలో ఎక్కడెక్కడ నీరు వదలాలి అనే విషయా లపై సుదీర్ఘంగా చర్చించడం జరిగిందన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రైతులు సూచనల మేరకు ఈరోజు అర్ధరాత్రి నుంచి ఎస్ఆర్‌బిసి, కెసి కెనాల్, తెలుగుగంగ ప్రాజెక్టులన్నింటికి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న రైతులందరూ ఉన్న నీటిని వృధా చేయకుండా ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి వచ్చే రబీ సీజన్ వరకు నీరు ఉండే విధంగా రైతులు అవసరమైన పంటలను సాగు చేయాలన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరు వరిసాగు చేయడం వల్ల భవిష్యత్తులో సమస్యలు వస్తున్నాయని వీటిని దృష్టిలో ఉంచుకుని రైతులు సీజనల్ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతుల సంక్షేమం కోరే పార్టీ అన్నారు. భగవంతుని దయవల్ల 20రోజులు ముందుగానే నీటిని విడుదల చేయడం జరుగుతుందని గత 15సంవత్సరాల నుంచి ఎప్పుడు ఇలా జరగలేదన్నారు. సీఎం ముందస్తు ఆలోచనల వల్ల రైతులకు నీరు వదిలే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నేడు ఐఎబి సమావేశంలో ముఖ్యంగా వాటర్ యూజర్ అసోసియేషన్ సభ్యులు కొత్తగా వచ్చిన తరువాత వారి పర్యవేక్షణలోనే నీటికి సంబంధించిన పనులన్నీ చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉండే రైతులు ఎవరు ఇబ్బందులు పడకుండా ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా ప్రతి రైతు చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలో సీమకు పుష్కలంగా నీరు తెప్పించింది ఎన్‌టి రామారావు, తరువాత చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. పులివెందులకు సైతం నీళ్లు ఇచ్చిన చరిత్ర తెలుగుదేశం పార్టీదే అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మాట్లాడే అర్హత వైసీపీకి లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఇరిగేషన్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు అందుబాటులో ఉంటూ ఆయా సమస్యలను పరిష్కరించి ప్రభుత్వానికి మంచిపేరు తేవాలన్నారు.

2లో

## తుంగభద్రనదీలో ముగ్గురు కర్ణాటక భక్తులు గల్లంతు

- స్నేహితులతో స్వామి దర్శనానికి యువకులు
- స్నానమాచరించడానికెళ్లి గల్లంతు
- మఠంఅధికారులు,పోలీసుల గాలింపు చర్యలు

2లో







## శ్రీశైలం డ్యాం రెండు గేట్లు మూసివేత

- ఒక్క గేటు ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల
- ఇన్ ఫ్లో 1,39,297 క్యూసెక్కులు
- అవుట్ ఫ్లో 95,534 క్యూసెక్కులు



శ్రీశైలం డ్యామ్ ఒక్క గేటు ద్వారా విడుదల అవుతున్న నీటి దృశ్యం

శ్రీశైలం,మేజర్ న్యూస్:కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది.దీంతో మూడు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న అధికారులు శనివారం ఉదయం 6 గంటల సమయంలో ఒక గేటు..10 గంటలకు మరో గేటును మూసివేశారు.కేవలం ఒక గేటు ద్వారా 27,157 క్యూసెక్కులు రెండు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి ద్వారా 68,377 క్యూసెక్కులు మొత్తంగా 95,534 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్కు విడుదల చేస్తున్నారు.శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు. కాగా శనివారం సాయంత్రం 6 సమయానికి డ్యామ్ నీటిమట్టం 883 అడుగులుగా నీటి నిల్వ సామర్థ్యం 204.3520 టీఎంసీలుగా నమోదైంది.ఇదే సమయానికి జూరాల సుంకేసుల ప్రాజెక్టుల ద్వారా 1,39,297 క్యూసెక్కుల వరద నీరు వచ్చి శ్రీశైల జలాశయానికి చేరింది.జలాశయం బ్యాక్ వాటర్ ద్వారా గడచిన 24 గంటల వ్యవధిలో కుడిగట్టు జల విద్యుత్ కేంద్రానికి 32,094 క్యూసెక్కులు,ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రానికి 35,016 క్యూసెక్కులు,మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,600 క్యూసెక్కులు,పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ కు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.నీటి ఆవిరి రూపంలో 227 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

మిగతా 7లో

### బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో

## హుండీలు చోరీ

– తరచూ దొంగతనాలతో పోలీసులకు సవాలు విసురుతున్న దొంగలు

8లో



సిసి పుటేజ్‌లో రికార్డు అయిన దొంగలు

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి చేయాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మిగతా 2లో



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

# జిల్లాలో రైతులందరికీ సాగునీరు అందిస్తాం


మాట్లాడుతున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**(మొదటిపేజి తరువాయి..)**

గోరుకల్లు రిజర్వాయర్ మాజీ ప్రధాని పివి నరసింహారావు ఆధ్వర్యంలో ప్రారంభిస్తే గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రూ.300కోట్ల నిధులు ఖర్చు చేయడంతో నేడు ఆ రిజర్వాయర్ ద్వారా కడప, నంద్యాల జిల్లాలో దాదాపు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వగలుగుతున్నామన్నారు. పులివెందులకు నీళ్లు కూడా గాలేరు నగరి సుజల స్రవంతి ద్వారానే ఇచ్చిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదే అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా శాసనసభ్యులు కలిసి గుండ్రేవుల ప్రాజెక్టు కోసం తీర్మానం చేసి సీఎం దృష్టికి తెస్తామన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నీరుపారుదల శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులకు సంబంధించిన నీటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నంద్యాల జిల్లాలో ఏఐబి సమావేశంలో ప్రజాప్రతినిధులు, రైతులు తెలియజేసిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, గౌరుచరితారెడ్డి, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, గిత్తాజయసూర్యలు మాట్లాడుతూ ఆళ్ళగడ్డ కెసి కెనాల్ కాలువ మీద శిల్పా వెంచర్ వేసి ఇరిగేషన్ ల్యాండ్‌ను దుర్వినియోగం చేయడం జరిగిందని వెంచర్ వేసిన వారిపై ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో లస్కర్ల సిబ్బంది కొరత వల్ల రైతులకు సక్రమంగా నీరు అందించలేకపోతున్నామని లస్కర్ల పోస్టులను భర్తీ చేసి సమస్య పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఇరిగేషన్ అధికారులు రైతులతో సోదరభావంతో మెలగి రైతులకు సంబంధించిన నీటి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈసమావేశంలో రైతులు, రైతు సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చరితారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య


హాజరైన రైతులు, అధికారులు

# తుంగభద్రనదీలో ముగ్గురు కర్ణాటక భక్తులు గల్లంతు

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం తుంగభద్రనదీలో స్నానానికెళ్ళి ముగ్గురు కర్ణాటక భక్తులు మృత్యువాత పడ్డ సంఘటన శనివారం చోటు చేసుకొంది. మంత్రాలయం ఎస్.ఐ శివాంజులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హసన్‌కు చెందిన రంగనాథ్, హేమంత్, దర్శన్, నారాయణ, సచిన్, హజిత్, ప్రమోద్‌లు అనే ఏడుగురు స్నేహితులు రాఘవేంద్రస్వామి దర్శనానికి శనివారం మంత్రాలయం విచ్చేశారు. స్నేహితులు కలిసి తుంగభద్రనదీలో స్నానమాచరించడానికి వెళ్లారు. ఏడుగురిలో నలుగురు మాత్రం ఒడ్డుపైనే ఉన్నారు. సచిన్ (19), ప్రమోద్(19), హజిత్(19) అనే భక్తులు స్నానమాచరించడానికెళ్ళి ప్రమాదవశాత్తు గల్లంతయ్యారు. అక్కడే ఉన్న మిగతా నలుగురు మఠం అధికారులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న మంత్రాలయం ఎస్.ఐ శివాంజులు, రాఘవేంద్రస్వామి మఠం మేనేజర్ శ్రీనివాస్‌రావు, సర్పంచ్ భీమయ్యలు సంఘట స్థలానికి చేరుకున్నారు. ఆ సంఘటన స్థలం వద్ద నలుగురితో వివరాలను అడిగి తెలుసుకొన్నారు. మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంత్రాలయంలో భారీగా వర్షం కురవడంతో గాలింపు చర్యలకు ఆటంకం ఏర్పడింది. కర్ణాటకలో భారీగా వర్షాలు కురవడంతో తుంగభద్రనదీ ఉధృతంగా ప్రవహిస్తోంది. అనంతరం నదీలో స్నానానికి ఎవరు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నదీలో స్నేహితులు గల్లంతు కావడంతో మిగతా వారు ఒత్తిడికి గురవుతూ, శోకసముద్రంలో మునిగారు.

## వక్ఫ్‌బోర్డు భూములు పేదలకు పంచాలి – సిపిఐ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** అధికార పార్టీ నాయకుల మధ్య వివాదాస్పదంగా మారిన వక్ఫ్ బోర్డు భూములను పేద ముస్లింలకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి,రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010లో బాలాజీ కాంప్లెక్స్ వద్ద ఉన్న 4 ఎకరాలు అర్హులైన పేద ముస్లింలకు ఇళ్ళ స్థలాలకై భూ పోరాటాల ద్వారా సాధించినట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని వక్ఫ్‌బోర్డు భూములను బడా పారిశ్రామికవేత్తలకు కట్టపెట్టేందుకు కుట్ర చేస్తుందన్నారు. ఇప్పటికైనా వివాదాస్పదమైన వక్ఫ్‌బోర్డు భూములు పేద ముస్లింలను గుర్తించి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అర్హులైన వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పేద ముస్లింలతో భూ పోరాటాలు నిర్వహించి గుడిసెలు వేస్తామని హెచ్చరించారు.

**కార్మికుల సమ్మెకు ప్రజలు సహకరించాలి – సిఐటియు** మున్సిపాలిటిలో ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు ప్రజలు సహకరించాలని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, గౌస్‌లు అన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం కార్మికులకు 21 వేలు చెల్లించాలన్నారు. హెల్త్ అలవెన్స్ మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వ హాయాంలో ఒప్పుకున్న హామీల జీవోలను వెంటనే విడుదల చేసి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మున్సిపల్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

## శ్రీశైలం ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జాం


ట్రాఫిక్ జామ్ తో నిలిచిపోయిన వాహనాలు

### శ్రీశైలం – హైదరాబాద్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ స్తంభించింది.రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో డ్యాం గేట్ల నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న కృష్ణా జలాలను చూసేందుకు భారీ సంఖ్యలో సందర్శకులు వాహనాల్లో తరలివస్తున్నారు.దీంతో ఘాట్ రోడ్డులో ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి,ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేయటంతో సందర్శకులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం పత్తికొండలో సీపీఐ 14వ నియోజకవర్గ మహాసభలను ఘనంగా నిర్వహించారు. మహాసభలకు ముఖ్యఅతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నక్కిలేనిన్ బాబు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్ నుండి నాలుగుస్తంభాల మండపం వరకు భారీ ప్రజా ప్రదర్శన చేపట్టి బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, చంద్రబాబు ప్రతిపక్షంలో ఉంటే ప్రాజెక్టు పూర్తి చేయాలని మాట్లాడుతారు. అధికారలలోకి వ స్తే ప్రాజెక్టుల గురించి ఏమాత్రం మాట్లాడరని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెబుతున్న చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టుతున్నారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదను ఆదాని అంబానీలకు దోచిపెడుతున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుకొని సీజ్ ద షిప్ అని ఎంతో హడావుడి చేసిన ఆయన ఈ మధ్య కాలంలో ఒక్క లారీని కూడ సీజ్ చేయడం లేదని, సనాతన ధర్మమంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. అనంతరం రామచంద్రయ్య మాట్లాడుతూ, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరకు చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రధానకాల్వల ద్వారా జిల్లాలోని 106 చెరువులకు నీళ్లు నింపాలన్నారు. అనంతరం జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ, జిల్లా అభివృద్ధికి 10వేల కోట్లు నిధులు కేటాయించలని డిమాండ్ చేశారు. సీపీఐ 14వ నియోజకవర్గ మహాసభల సందర్భంగా పట్టణ పురవీదుల గుండా చేపట్టిన భారీ ప్రజాప్రదర్శన ప్రజలను ఆకట్టుకొంది. అనంతరం ప్రదర్శన ముందు గౌరవయ్యల నృత్యప్రదర్శన, గిరిజన మహిళల ప్రదర్శన, మహిళల కోలాటం, చిన్నారుల వేషధారణ, ప్రజానాట్య మండలి గేయాలు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నభీ రసూల్, భాస్కర్ యాదవ్, విరుపాక్షి, ఐదు మండలాల కార్యదర్శులు రాజాసాహెబ్, సుల్తాన్, నాగరాజు, కృష్ణ, ఖలీల్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, తిమ్మయ్య, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, పెద్ద ఈరన్న, రవి మోహన్, ప్రజాసంఘాల నాయకులు నెట్టికంతయ్య, రంగన్న, ముని శాఖ కార్యదర్శులు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రాంకో సిమెంట్ ఫ్యాక్టరీని ముట్టడిస్తాం



మాట్లాడుతున్న నాయకులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కలవటాల గ్రామంలో రాంకో సిమెంట్ పరిశ్రమ ఏర్పడి దశాబ్ధాలైనా యాజమాన్యం రైతుల ద్వారా తీసుకున్న పొలాలకు నష్టపరిహారం ఇవ్వకుంటే బాధిత రైతుల కుటుంబాలతో కలిసి ఫ్యాక్టరీని ముట్టడిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమన్న, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన ్లు హెచ్చరించారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఏర్పాటుకు పొలాలు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం అందించాలని, రైతుల కుటుంబంలో ఉద్యోగాలు కల్పించాలని అన్నారు. వీటిపై రాష్ట్ర గవర్నర్‌కు, రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉపముఖ్య మంత్రికి, పరిశ్రమల శాఖ మంత్రికి, సీపీఐ, సీపీఎం రాష్ట్ర నాయకులకు మెమోరాండాల ద్వారా సమస్యను తెలియజ ేయడం జరిగిందని, కానీ వారు స్పందించడం లేదని ఆరోపించారు. రాంకో చుట్టు పక్కల కాలుష్యంతో రైతుల పంటలు నష్టపోతు న్నారని, భూములిచ్చిన రైతు కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలని, పరిశ్రమల దుమ్ము, దూళి, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల బాధిత గ్రామాల లో ప్రతి నెల ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఫ్యాక్టరీని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

# రైతుల ఆత్మహత్యలకు అరికట్టాలి



మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వీటిని వెంటనే అరికట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల పట్టణంలోని నరసింహయ్య భవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌లు మాట్లాడుతూ ఇటీవల నంద్యాల జిల్లాలోని రుద్రవరం, బండిఆత్మకూరు మండలాల్లో ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. పెట్టుబడులు తారాస్థాయికి చేరుకున్నాయని దిగుబడులు మాత్రం తగ్గిపోతున్నాయని అన్నారు. అరకొర పండిన పంటలకు మద్దతు ధరలు లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మొదట్లోనే నీరు సమృద్ధిగా ఉన్నా నీరు విడుదల చేయకపోవడంతో జిల్లాలో మెట్ట పొలాలు ఎండిపోతున్నాయని అన్నారు. జిల్లాలో యూరియా లాంటి ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నా రైతులు మాత్రం సొసైటి అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పొగాకు రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# గోల్డ్ మైనింగ్ వారి పై చర్యలు తీసుకోండి

**డోన్, మేజర్‌న్యూస్:** రైతులకు అన్యాయం చేస్తున్న గోల్డ్ మైనింగ్ వారిపై చర్యలు తీసుకోవాలని కేంద్రగనుల భారీ పరిశ్రమలశాఖ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను బీజేపి కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా శనివారం అనంతపురం జిల్లా, గుంతకల్లులో మంత్రిని కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొత్తకాపు హేమసుంద ర్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జియో మైసూర్ ప్రైవేట్ లిమిటెడ్ గోల్డ్ మైనింగ్ వారు జొన్నగిరి, బొల్లవా నిపల్లె, పగిడిరాయి గ్రామాల రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతులకు మాయమాటలు చెప్పి వారి పిల్లలకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పిస్తామని చెప్పి రైతులకు తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారన్నారు. అదేవిధంగా మైనింగ్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పండ్ల తోటలకు భూగర్భజలాలు కలుషితం అయి అక్కడ ఉన్న చెట్లు నశించిపోయి, పంటల దిగుబడి తగ్గి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. కావున రైతులకు నష్టపరిహారం అందేలా కేంద్రంతో చర్చించి, వారిని ఆదుకోవాలని మంత్రిని కోరారు.


కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కొత్తకాపు హేమసుందర్‌రెడ్డి

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

## – ఎమ్మెల్యే పార్థసారధి



**ఆదోని, మేజర్ న్యూస్ :** ఈనెల 17న జరిగే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పార్థసారధి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే వ ాట్లాడ ుత ార , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సాయి డిగ్రీ కళాశాలలో 10 కంపెనీలతో మెగా జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బి.ఫార్మాసి చదువుకొని వయస్సు 18నుండి 30సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులకు అర్హులన్నారు. ఈనెల 17న సాయి డిగ్రీ కళాశాలనందు మెగా జాబ్ మేళాకు 10 కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుంది. అనంతరం జాబ్ మేళా వాల్ పోస్టర్లను వారు విడుదల చేశారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు రెస్యూమ్, ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్ పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో ఉదయం 9గంటలకు డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని వారు కోరారు.

# ఎస్‌డీపీఐ శ్రీశైల అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** స్థానిక పట్టణంలోని ఎస్‌డీపీఐ కార్యాలయంలో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షులు ఆరీఫ్‌హుసేన్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. నంద్యాల జిల్లా ఎస్‌డీపీఐ ఉపాధ్యక్షులు అబ్దుల్ కలాం, జిల్లా కమిటీ సభ్యులు మహబూబ్‌బాష, స్థానిక అసెంబ్లీ నాయ కులు పాల్గొని మాట్లాడుతూ పార్టీ ఎదుగుదల, భవిష్యత్తులో పార్టీ కార్యకలాపాల విస్తర్ణపై చర్చించారు. పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేయడం, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయా న్ని సాధించేందుకు కార్యాచరణ ప్రణాళికలపై దృష్టి పెట్టారు.




# ప్రత్యేక పూజలందుకున్న కోన వెంకటేశ్వరుడు.!

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి కొండపై వెలసిన శ్రీ కోన వెంకటేశ్వరుడికి శనివారం భక్తులు విశేష పూజలందించారు.ప్రతి శనివారం కొండపైవెలసిన సతిసమేత వెంకటేశ్వరు డు అలివేలు మంగమ్మ,భూదేవిల మూల విగ్ర హాలకు అభిషేక, ప్రత్యేక పుష్ప పత్రాలతో పూజలు నర్వహించుకొనుటకు భక్తులు అధిక సంఖ్యలో కొండపైకి చేరుకొని స్వామివారికీ ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకుంటారు.భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



# 16న సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు వేలం

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** వివిధ కేసుల్లో ఆదోని వన్ టౌన్ పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలకు ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు ఆదోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ వెనకాల ఉన్న పోలీస్ క్వార్టర్స్ దగ్గర బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆదోని వన్ టౌన్ సీఐ శ్రీరామ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వన్ టౌన్ పోలీసులు పలు సెక్షన్ల కింద ఈ వాహనాలను స్వాధీన పరచుకుని 2023 డిసెంబర్ 12వ తేదీన కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అప్పటినుంచి వీటిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంచడం జరిగిందన్నారు. ఈ ద్విచక్ర వాహనాలకు చెందిన యజమానులు సరైన పత్రాలను చూపించి తీసుకెళ్లాలని 2024 సెప్టెంబర్ 23వ తేదీన పత్రికా ప్రకటనల ద్వారా తెలియజేయడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ సదరు వాహనాల యజమానులు ఇప్పటివరకు ముందుకు రానందున పోలీసుల ఆధీనంలో ఉన్న ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆధార్ కార్డు కాపీతో వచ్చి బహిరంగ వేలంలో పాల్గొని వాహనాలను కొనుగోలు చేయవచ్చని కోరారు. పూర్తివివరాలకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వారిని సంప్రదించాలని కోరారు.

# ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తా..

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందజేస్తామని టిడిపి నాయ కులు ఎంజి.నరసన్న. ఎద్దులశివలు పేర్కొన్నారు శనివారం పెద్దకడుబూరు మండల పరిధిలోని చిన్న కడుబూరు. హెచ్. మురువణీ గ్రామాలలో సుపరి పరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ముందుగా చిన్నకడుబూరు గ్రామం టిడిపి అధ్యక్షులు ఎంజి నరసన్న. బ్రోకర్ లక్మన్న తోపాటు మరి కొంత మంది నాయకులు. కార్యకర్తలు కలసి ప్రతి ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలైన ఉచిత గ్యాస్. తల్లికి వందనం. ఫించన్ల. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు తదితర పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజల ను అడిగి తెలుసుకున్నారు. అలాగే హెచ్ మురువణీ గ్రామంలో కూడా ఈడిగ సత్యన్నగౌడు. ఎద్దులశివ అద్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు కలసి ప్రతి ఇంటింటికి వెళ్లి టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు గురించి కరపత్రాలు ద్వారా ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# వ్వవసాయాబోర్లుకు విద్యుత్ సరఫరాలో మార్పులు

## : విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** ఈనెల12వతేదినుండి17వతేదివరకు 220కెవి ఎపి కార్బైడ్ నుండి 132కెవి గూడూరు వరకు ఉన్న 132కెవి ఫీడర్ లో మర్మతులు చేస్తున్న దృష్ట్యా మండలంలో వ్వవసాయా బోర్ల బావుల కు విద్యుత్ సరఫరాలో మార్పులు చేయడం జరిగిందని పెద్దకడుబూరు మండల విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. అలాగేమండలంలోని రైతులు విద్యుత్ శాఖకు సహకరిం చాలని అయన రైతులను కోరారు...



# మద్యపాన, మత్తు పదార్థాల వ్యసన విముక్తి పై అవగాహన

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** నగరంలోని ధర్మపేటలో నైపుణ్యరహిత మరియు అల్పాదాయ వర్గాల కార్మికులనుద్దేశించి డ్రగ్స్ మత్తు కలిగించేటటువంటి పదార్థాల వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించి చెడు వ్యసనాల జోలికిపోకుండా కుటుంబ పరిరక్షణ కోసం పాటుపడేలా కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం ఎక్సైజ్ శాఖ ఆద్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి సుధీర్‌బాబు, ఎన్జీఓ ప్రెసిడెంట్, కేర్ కమిటీ సభ్యుడు రాజేంద్రప్రసాద్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఈఎస్టిఫ్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100మంది ప్రజలు పాల్గొన్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్ తెలిపారు.

# ప్రతిరోజు పల్లె నిద్ర కార్యక్రమాలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ఆయా సమస్యాత్మక గ్రామాల్లో జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు 6గ్రామాల్లో రాత్రి బస(పల్లెనిద్ర) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామస్తులతో మాట్లాడి ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాల జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజల సంతోషమే కూటమి లక్ష్యం : ఎమ్మెల్యే కోట్ల



కొమ్మెమర్రిలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి

**ప్యాపిలి, మేజర్‌న్యూస్‌:** రాష్ట్ర ప్రజల సంతోషమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనీ డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని కొమ్మెమర్రి, గుట్టలపల్లి, కౌలుపల్లి, బూరుగల, సీతమ్మతాండ గ్రామాలలో ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని ప్రజల వద్దకు వెళ్ళి కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి కరపత్రాల రూపంలో ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆగష్టు నెలలో రైతుల బ్యాంక్ ఖాతాలలో అన్నదాత సుఖీభవ జమ అవుతాయని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావుయాదవ్, ప్యాపిలి మండల ఇంచార్జ్ ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, లక్కసాగరం లక్ష్మిరెడ్డి, వై.లక్ష్మినారాయణయాదవ్, ఆర్ఈ.నాగరాజు, కొమ్మెమర్రి వెంకటరాముడు, మెట్టుపల్లి సుదర్శన్, బావిపల్లె ప్రసాద్, గుడిపాడు వెంకటరెడ్డి, నేరేడుచెర్ల లాల్‌రెడ్డి, కౌలుపల్లి శివారెడ్డి, బూరుగల పురుషోత్తంరెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి, రాజుయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, బోయిన్‌చెరువుపల్లి కృష్ణయ్య, సీమ సుబ్బారెడ్డి, రాచర్ల శ్రీరాములు, కృష్ణారెడ్డి, హుస్సేనాపురం చంద్రశేఖర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఎంపీ ప్రత్యేక కృషి

**– దక్షిణ మధ్య రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటీవ్ కమిటీ మెంబర్ వెంకట రంగయ్య**



జడ్ఆర్‌యుసీసీ వెంకట రంగయ్యకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న రైల్వే అధికారులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నంద్యాల రైల్వే స్టేషన్ అభివృద్ధికి నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రత్యేక కృషి చేస్తున్నారని దక్షిణ మధ్య రైల్వే జోనల్ యూజర్స్ కన్సల్టేటీవ్ కమిటీ మెంబర్ (జడ్ఆర్‌యుసీసీ) వెంకట రంగయ్య అన్నారు. శనివారం నంద్యాల రైల్వే స్టేషన్ మేనేజర్ చంద్రశేఖర్‌తో వెంకట రంగయ్య సమావేశమై ఎంపీ శబరి ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. నంద్యాల రైల్వే స్టేషన్‌లో సమస్యల గురించి తెలుసుకున్నారు. డబ్లింగ్ పనులు, స్టేషన్‌లో డ్రింకింగ్ వాటర్ గురించి, స్టాల్స్‌లో రేట్లు, లిఫ్ట్, నూతన ట్రైన్‌ల ఏర్పాటు, రేణిగుంట– తిరుపతికి, మధ్యాహ్న సమయంలో ప్యాసింజర్, ఇంటర్సిటీ గురించి, నంద్యాల నుంచి గుంతకల్‌కి డేటైమ్‌లో ఫ్యాసింజర్, ఇంటర్సిటీ ట్రైన్ ఏర్పాటు గురించి, కరోనా టైమ్‌లో రద్దు చేయబడిన ఫ్యాసింజర్ రైలుల గురించి, గుంటూరు – నంద్యాల– తిరుపతి ట్రైన్‌కు కోవెలకుంట్లలో స్టాప్, బేతంచెర్ల స్టేషన్‌లో ఎక్స్ ప్రెస్ ట్రైన్‌ల స్టాపింగ్, గుంటూరు– ఔరంగబాద్( 17253/17254) ట్రైన్‌కు పాణ్యం, బుగ్గనిపల్లె, మల్కాపురంలలో స్టాపింగ్ ఏర్పాట్లు, నంద్యాల రైల్వే స్టేషన్‌లో కొత్త రాతి నంది విగ్రహం ఏర్పాటు, గాజులపల్లి పేరు స్థానంలో మహానంది పేరు వచ్చేలాగా (గాజులపల్లి – మహానంది రోడ్డు)ఏర్పాటు గురించి, కొత్త రైల్వే జోన్ (విశాఖ) శ్రీధర్, తదితర అంశాలపై చర్చించారు. పై విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి, ఎంపీ బైరెడ్డి శబరి దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలిపారు. అంతకు ముందు నంద్యాల రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆయనకు రైల్వే అధికారులు, సిబ్బంది శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు.

## సుపరిపాలనలో తొలి అడుగు



**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని 102, 105 బూత్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షుడు మోమీన్ రసూల్ ఆధ్వర్యంలో ఇంటింటికి కరపత్రాల పంపిణి, ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సూపర్ సిక్స్ పథకాలకు అర్హులైన వారికి అందేలా చూస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి గిరిబాబు, అజ్మతుల్లా, ఐటీడీపీ నాయకులు హుసేన్, సయ్యద్, కరిముల్లా, అషీఫ్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గౌరు చరితను కలిసిన కమీషనర్



ఎమ్మెల్యే గౌరుచరితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమీషనర్

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** నూతనంగా కర్నూలు మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి విశ్వనాథ్ శనివారం పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరుచరితరెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా కమీషనర్ విశ్వనాథ్ ఎమ్మెల్యే గౌరుచరితకు పుష్పగుచ్ఛం అందచేసి పలు విషయాలపై చర్చించారు.

## విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలి

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి నాయకత్వ లక్షణాలను, క్రమశిక్షణ అలవరచుకోవాలని డిఎస్పీ మహబూబ్ బాషా, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డిలు అన్నారు. శనివారం నగరంలోని ఏల్కూరు బంగ్లాలో ఉన్న నారాయణ స్కూల్ నందు విద్యాసంస్థల ఏజీఎం రమేష్ ఆధ్వర్యంలో పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల తరహాలో విద్యార్థులకు ఎన్నికల నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుండే తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుతో పాటు ఆటపాటల్లో రాణించాలన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులు నచ్చిన రంగంలో రాణించేలా తగిన తర్ఫీదును ఇవ్వడంతో పాటు చిన్నతనం నుండే మంచి విలువలను నేర్పించి నాయకత్వ లక్షణాలను నేర్పించి పెట్టుకున్న లక్ష్యాలను చేరుకునేలా శిక్షణ ఇవ్వడం నారాయణ పాఠశాలల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులు తమ ఓటు ద్వారా తమకు నచ్చిన సరైన నాయకులను ఎన్నుకుని క్యాబినెట్ ఎన్నికల కార్యక్రమం ఘనంగా నిర్వహించారన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం వారి కళలను నెరవేర్చడమేనని అన్నారు. ఈ ఎన్నికల విభాగంలో హెడ్ బాయ్స్ కె గణేష్, కె ధీరజ్, డి రోహిత్, , హెడ్ గర్ల్స్ నివృతి, పోషిక, డిప్యూటీ హెడ్ బాయ్స్ బి సంతోష్, ధరణిధర్ రెడ్డి, అఖిల్, కౌశిక్, డిప్యూటీ హెడ్ గర్ల్స్ కె జయ, జ్వనితలు ఎన్నికయ్యారు. గెలుపొందిన వారికి ప్రత్యేక బ్యాడ్జీలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతి, నారాయణరెడ్డి, ఏఓ దస్తగిరి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నీటిపారుదల సలహా మండలి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**కేసీకి శనివారం అర్ధరాత్రి నుచే నీటి విడుదల**




సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

**ఆళ్లగడ్డ మేజర్ న్యూస్ :** కేసి కెనాల్ మరియు తెలుగు గంగ కాలువకు శనివారం అర్ధరాత్రి నుండినీటిని విడుదల చేస్తున్నట్టు తఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. నంద్యాలలో శనివారం జరిగిన నీటిపారుదల సలహా మండలి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆళ్లగడ్డ రైతుల సమస్యల గురించి. చివరి ఆయకట్టు వంకు నీటిని అందించాలని గత ఏడాది రైతులకు నీరు అందక చాలా ఇబ్బందులు పడ్డారని ఇప్పుడు అలా కాకుండా ప్రతి ఒక్క రైతుకు నీరు అందాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అధికారులకు తెలియజేశారు.రైతుల దగ్గర నుండి కొనుగోలు చేసిన జొన్నలకు డబ్బులు పడేలాగా చూడాలని మొన్న శ్రీశైలం కు వచ్చినప్పుడు మంత్రిగారితో మాట్లాడడం జరిగిందని మళ్లీ ఈరోజు కూడా ఈ సమావేశంలో తెలియజేస్తున్నారన్నారు. రైతులు ఎవరు ఇబ్బంది పడకుండా త్వరగా వారి అకౌంట్లో డబ్బులు వేసే లాగా చూడాలని. కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే తెచ్చారు . ఆళ్లగడ్డలోకేసీ కెనాల్ పై శిల్పా వెంచర్ ఏర్పాటు చేశారని అలా ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేసి అధికారులు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని. నేను ఎన్నోసార్లు శిల్పా వెంచర్ పై అసెంబ్లీలో మాట్లాడడం జరిగిందని. శిల్పా వెంచర్లో మోసపోయి ఇల్లు కట్టుకున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని అలాగే శిల్పా వెంచర్ వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కలెక్టర్ తెలియజేశారు.ఆళ్లగడ్డ తాలూకా లోని అగ్రికల్చర్ మరియు కేసీ కెనాల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసుకొని రైతులందరికీ ఏ పంట వేస్తే గిట్టుబాటు ధర వస్తుందో అని ఆ పంటలేవేసేలాగా చూసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు...

## కూటమిప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధి

**- ఎమ్మెల్యే.బొగ్గుల దస్తగిరి**



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి.బెళగల్ మండలం బూరందొడ్డి గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ రామాంజినేయులు,టీడీపీ సినియర్ నాయకుడు రాంమోహనరెడ్డి ఆధ్వర్యంలో సూపరిపాలనలో ముందడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పాలొన్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికారు. అనంతరం నాయకులతో కలసి గడపగడపకు తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్,తల్లికి వందనం,సబ్సిడీ గ్యాస్ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసున్నారు, కూటమి ప్రభుత్వం లో చేసిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలు అడిగి తెలుకున్నారు. ఎక్కువగా భూ సంబంధ మైన రెవెన్యూ సనస్యలు జాయింట్ ఎల్పిఎంలు ఎమ్మెల్యే దృష్టికి తెలిపారు. అందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయం సిబ్బందికి సమస్యలను ఆదేశిస్తూ రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు.గ్రామంలో గోకరామయ్య దర్గా వద్దకు సిసి రోడ్డు కొనసాగించాలని అందుకు తమరు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ను గ్రామ నాయకులు కోరారు.అందుకు అధికారులతో మాట్లాడి సిసి రోడ్డు అనుమతులు ఇపిస్తాను అని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్,అమర్నాథ్,రాంమోహన్ రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు,కడియాల శరత్,సూర్యచంద్ర, మైనారిటీ నాయకులు గౌస్,దూద్ వలి, డిష్ వెంకటేష్,భీమన్న, నాగరాజు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**– కమీషనర్ పి.విశ్వనాథ్**



పనులను పరిశీలిస్తున్న కమీషనర్ విశ్వనాథ్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలో వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక కమీషనర్ పి విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు, 5వ శానిటేషన్ డివిజన్ కార్యాలయం, గడియారం ఆసుపత్రి, పాత తుంగభద్ర, పంప్‌హౌస్, వాహనాల మరమత్తుల షెడ్, గార్గేయపురం డంప్ యార్డులో బయోమైనింగ్, శునకాల సంతాన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయా పనులను ఏయే దశలో ఉన్నాయని వాటి పురోగతిపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. ఈ సందర్బంగా కమీషనర్ మాట్లాడుతూ పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు త్వరితగతిన తీసుకోవాలని, అభివృద్ధి పనుల్లో జాప్యం తగదని సూచించారు. పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీటి సరఫరా మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గడియారం ఆసుపత్రి ఆధునికీకరణ పనులు, బయోమైనింగ్, శునకాల సంతాన నియంత్రణ ఆపరేషన్లు మరింత వేగవంతం చేయాలని కమీషనర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ రెడ్డి, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో సీటు దొరకక కూలీగా మారిన విద్యార్థినీయులు



పత్తి చేనులో పని చేస్తున్న విద్యార్థినీయులు





**హొళగుంద,మేజర్‌న్యూస్‌:** హొళగుంద కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో సీటు దొరకకపోయే సరికి మండల పరధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన హరిజన సరస్వతి,హరిజన పార్వతి ఇద్దరు విద్యార్థినీయులు కూలీలగా మారారు.గ్రామానికి చెందిన హరిజన లక్ష్మి,హరిజన ఉలిగన్న కుమార్తె సరస్వతి,ఆదే గ్రామానికి చెందిన హరిజన ఎం.లక్ష్మి,రాముడుల కుమార్తె పార్వతిల ఇద్దరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి వరకు చదువుకున్నారు.ఆరవ తరగతి కోసం హొళగుంద కేజీబీవీలో సీటు కోసం ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్నారు.దళిత వర్గానికి చెందిన విద్యార్థినీయులకు సీటు దొరకకపోవడంతో హెబ్బటం,హొళగుంద ఉన్నత పాఠశాలలో చేర్పించి చదువులకు తల్లిదండ్రులు పంపలేకపోయారు.ఎందుకంటే సరైన వసతి సౌకర్యాలు లేవని ఇబ్బందులు పడలేక వారిని ఇండ్ల వద్దనే ఉంచుకుని కూలీ పనులకు పంపిస్తున్నారు.గ్రామంలో కూలీలు లేకపోతే ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తే మా పిల్లలను వెంట పట్టుకుని వలసలు వెళ్తామని తల్లిదండ్రులు తెలిపారు.మాకు చదువుకోవాలని ఉందని కానీ కేజీబీవీ హస్టల్‌లో సీటు దొరకకపోవడంతో మా తల్లిదండులు కూలీ పనులకు పిలుచుకుని పోతున్నారని విద్యార్థునీలు వాపోయారు.అధికారులు సహకరించి మాకు కేజీబీవీ హస్టల్ సీటు కల్పిస్తే చదువుకుంటామని విద్యార్థినీయులు సరస్వతి,పార్వతి చెప్పారు.

# అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు

**– ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి**



ఇళ్ల పట్టాలు అందచేసిన ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని ఏ గోకుల పాడు గ్రామంలో ఎస్‌సి కాలనీలో అర్హులైన వారికి శనివారం ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎస్‌సి కాలనీకి చెందిన అర్హులైన 30మందికి 1.50సెంట్ల చొప్పున పట్టాలను అందచేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ఇళ్ల పట్టాలు అందుకున్న వారు ఎమ్మెల్యే గౌరు చరితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు లక్ష్మి వరదరెడ్డి, ఎంపిటిసి నాగరాజు, రమణరెడ్డి, బిజెపి నాయకుడు సోమశేఖర రెడ్డి, హరిజన సుంకన్న, టి రాజు, రామాంజనేయులు, నెరవాడ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాము

**తాలుకాను అన్ని రంగాలలో సస్యశ్యామలం చేస్తాం**



**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి నగరంలో డోర్ టు డోర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పాల్గొన్నారు. ముందుగా గాయత్రి మాత ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. అలాగే ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రమంతటా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ , మంత్రులు అందరూ డోర్ టు డోర్ తిరుగుతూ రాష్ట్రము ఎంత అభివృద్ధి కాబోతుందో వివరిస్తున్నారు. ఆళ్లగడ్డలో అన్నిచోట్ల రోడ్ల వర్కులు జరుగుతున్నాయని ఇంకా 16 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. వైసీపీ నాయకుల్లాగా కల్లబొల్లి మాటలు చెప్పమని, మేము చేసే అభివృద్ధి చూసి ఓర్వలేక మాపై బురద చల్లే మాటలు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మన రాష్ట్రానికి ప్రాజెక్టులు, కంపెనీలు అన్ని తీసుకొని వస్తారని చదువుకున్న పిల్లలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. శనివారం నంద్యాలలో మీటింగ్ జరిగిందని అందులో రైతులందరూ పాల్గొని వారి సమస్యలను డైరెక్ట్ గా అధికారులతో ఎమ్మెల్యేలతో సమస్యల గురించి చర్చించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో ఎవరైనా రైతులు మాట్లాడితే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో పెట్టించేవారని, మా ప్రభుత్వం అలా కాదని ప్రజలందరికీ అందుబాటులో ఉండే ప్రభుత్వమని ఎమ్మెల్యే తెలిపారు.

# నేటి విద్యా వ్యవస్థకు కళాశాలలో వినూత్న మార్పులు

**– దేశ అభివృద్ధికి దోహద పడాలి**

**– రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి**

**– 25 సంవత్సరాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం**





రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం  మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నాగేంద్ర

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నేటి విద్యా వ్యవస్థకు అనుగుణంగా కళాశాలలో వినూత్న మార్పులను తీసుకొని వచ్చినట్లు రామకృష్ణ విద్యా సంస్థల అధినేత రామకృష్ణారెడ్డి అన్నారు. కళాశాల విద్యార్థులు దేశ విదేశాల్లో స్థిరపడటం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరు దోహద పడాలని పిలుపునిచ్చారు. కళాశాల స్థాపించిన తర్వాత 25 సంవత్సరాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 1998 నుంచి 2002 వరకు ఎసిఎం, ఎంబిఎ, ఎంఎస్‌సి, బిసిఎ, ఎంకామ్ తదితర కోర్సుల నుంచి 16 బ్యాచ్‌ల విద్యార్థులతో పూర్వ సమ్మేళనాన్ని రామకృష్ణ పిజి కళాశాలలో నిర్వహించారు. సమ్మేళనానికి రామకృష్ణారెడ్డితోపాటు డైరెక్టర్ విజయకుమారి, హేమంత్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. కళాశాల పూర్వ విద్యార్థులు సురేష్‌కుమార్, భార్గవి, నాగేంద్ర, మధు, వెంకట రావులు హాజరయ్యారు. దేశ విదేశాల్లో స్థిరపడిన విద్యార్థులు రామచంద్రారెడ్డి, ఆదినారాయణ, మధుసూదన్‌బాబు, మహేష్‌కుమార్, చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, నరేంద్ర, డానియేల్, చెంచిరెడ్డి, జయరాం, విశ్వనాథ్, గురురాజాలు కోర్ కమిటి లుగా ఏర్పడి స్నేహితులందరిని ఒకచోట చేర్చి సమ్మేళనానికి నాంది పలికారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరిని ఒకచోట చూడటం ఆనందంగా ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి విద్యార్థులే మూలకారణమన్నారు. హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో సౌత్ జోన్ షటిల్ పోటీలలో కళాశాల విద్యార్థులు రెండు, మూడు స్థానాల్లో నిలిచారన్నారు. ఎన్‌ఎఎసిలో ఏ గ్రేడ్ వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు నాగేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం హిందూపుర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారన్నారు. మహేంద్ర మాట్లాడుతూ ఇక్కడ ఉపాధ్యాయులుగా పని చేసి ఎంతో ఉన్నత విలువలను పొందానన్నారు. భార్గవి మాట్లాడుతూ పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణారెడ్డి ఆదర్శవంతమైన వ్యక్తిత్వం కలిగిన వారన్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి, విజయకుమారిలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు అంధ పాఠశాలకు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు.

# రవీంద్రబాబుకు ఘన వీడ్కోలు

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు నగరపాలక కమీషనర్ యస్ రవీంద్రబాబు సిడిఎంఎ కార్యాలయానికి బదిలీ అయిన సందర్భంగా కర్నూలు పాలక వర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం స్థానిక ఎస్‌బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవన్‌లో బదిలీపై వెళ్తున్న రవీంద్రబాబును మేయర్ బివై రామయ్య, నూతన కమీషనర్ పి విశ్వనాథ్, అధికారులు, సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమీషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ తాను మూడుసార్లు కర్నూలు నగరానికి సేవలు అందించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని, అనేక సమస్యలు, సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొన్నామన్నారు. తాగునీటి సరఫరా, కోవిడ్, సచివాలయ వాలంటరీల నియామకాలు వంటి అనేక విపత్కర పరిస్థితులున సమర్థవంతంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా మూడు పర్యాయాలు సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమీషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌ఓలు జునైద్, ఇబ్రాయిల్, ఇంచార్జ్ ఎంఈ శేషసాయి, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షణ అధికారి నాగరాజు, సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుంది

**– భాస్కరాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు**

**– ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే 80 శాతం హామీలను నెరవేర్చాము – ఎమ్మెల్యే గిత్త జయసూర్య**



ప్రజలకు సుపరిపాలన గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూపాడుబంగ్లా మండలంలోని భాస్కరాపురం గ్రామంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుని సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేఇసన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి సమస్యల వినతులను స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే 80 శాతం హామీలు పూర్తి చేశామని తెలిపారు. పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు అలాగే దివ్యాంగులకు రూ.4 వేలు పింఛన్, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టులో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తల్లికి వందనం అందించడం జరిగిందన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ నగదును త్వరలోనే జమ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు పట్టెడన్నం పెట్టాలని అన్నా క్యాంటిన్లను ఏర్పాటు చేస్తే గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించడం జరిగిందని ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మరలా 200 పైచిలుకు క్యాంటిన్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుపరిపాలన అందించడం కేవలం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని అన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ గిరీష్ రెడ్డి, మోహన్ రెడ్డి, కృష్ణా రెడ్డి, తర్తూరు రమణా రెడ్డి, తంగడంచ పిక్కిలి శ్రీనవాసులు, రామచంద్రా రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, రవికాంత్, హుస్సేనయ్య, శివ,చిన్నయ్య, నడిపి సోమన్న, నాగేంద్ర, పుల్లయ్య, సంజన్న, పగిడాల మండల టీడీపీ కన్వీనర్ మహేశ్వర్ రెడ్డి, హుస్సేన్ సాహెబ్, మహిళా నాయకురాలు ప్రసన్న, నాయకులు షాలు బాషా, బూత్ ఇన్‌చార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తజనం



**శ్రీశైలం,మేజర్ న్యూస్:**వరసగా రెండు రోజులు సెలవు దినాలు కావడంతో శ్రీశైల మల్లన్న క్షేత్రానికి భక్తజనం పోటెత్తారు.రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శనివారం శ్రీశైలం తరలివచ్చారు.ముందుగా పవిత్ర పాతాళగంగలు పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామి అమ్మవార్ల దర్శనార్థమై ఆలయ క్యూలైన్లలో బారులు తీరారు.దీంతో ఉచిత,శీఘ్ర,అతి శీఘ్ర క్యూలైన్లు లన్నీ భక్తులతో కిక్కిరిస్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. మరోవైపు శ్రీశైలం ఘాట్ రోడ్లన్నీ భక్తుల వాహనాలతో ట్రాఫిక్ జాం ఏర్పడింది.

# స్టోరేజ్ ట్యాంక్ వద్ద తరుచుగా సమస్యలే..!



ఫిల్టర్ బెడ్ వద్ద నీటి కోసం ఇబ్బందులు పడుతున్న దృశ్యం

**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుంద సమీపంలోని కడ్లేమాగి క్యాంఫ్ వద్ద ఉన్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ వద్ద తరచుగా సమస్యలు ఏర్పడడంతో హొళగుందలో ప్రజలు మంచినీటికి కష్టాలు పడుతున్నారు.ట్యాంక్ నుండి నీరు గ్రామానికి సక్రమంగా సరఫర కాకపోవడంతో గ్రామంలో మంచినీటి కష్టాలు తీవ్రంగా ఏర్పడ్డాయి.దాంతో ప్రజలు బిందెలను పట్టుకుని ప్రభుత్వ కార్యాలయం వెనక ఉన్న వాటర్ వర్క్ వద్ద ఉన్న ఫీల్టర్ బెడ్‌లో ప్రజలు నీటిని నింపుకుని ఇండ్లకు తెచ్చికునే పరిస్థితి గ్రామంలో దాపరించింది.స్టోరేజ్ ట్యాంక్‌లో ఒక రోజు ట్రాన్స్‌పార్మర్ సమస్య అంటు మరో రోజు ఫైఫ్ లైన్ సమస్య ఏర్పడిందని ఏదో సాకు చెప్పడంతో ప్రజలకు నీటి కష్టాలు ఎదురైయ్యాయి.సంభందిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల,కంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా ప్రతి సారీ నీటి సమస్య ఏర్పడుతుందని ప్రజలు విమర్శిస్తున్నారు.కొన్ని వీధులకు మూడు రోజులకు నీటిని సరఫరా చేస్తే చాలా వీధులకు 9,10 రోజులైన నీటి సరఫరా కాకపోవడంతో ప్రజల ఇబ్బందులు వర్ణానాతీతంగా ఉంటుంది.ఇప్పటికైన సంభంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామంలో మంచినిటి ఎద్దడిని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.ఈ విషయం గురించి గ్రామ పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్‌ను సంప్రదిస్తే స్టోరేజ్ ట్యాంక్ నుండి నీరు సక్రమంగా వస్తే గ్రామంలో వీదుల వారిగా ఇబ్బందులు లేకుండా నీటిని సరఫరా చేస్తామని చెప్పారు.

## కుంటలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం



**హొళగుంద,మేజర్ న్యూస్ :** హొళగుంద పోలీసు స్టేషన్ పరధిలోని హెబ్బటం,కురకుంద మార్గంలోని రైతు పోలంలో పెద్ద కుంటలో శనివారం గుర్తు తెలి యని వ్యక్తి శవం లభ్యమైయింది.పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.రైతు పంటల సాగు కోసం వర్షపునీరు నిల్వఉంచేందుకు కుంటను తవ్వకున్న ఆ కుంటలో గుర్తు తెలియని వ్యక్తి శవంగా కనబడ్డాడని తెలిపారు.30,35 మధ్య వయసులో గల వ్యక్తి శవం బోర్ల పడి ఉందన్నారు,కడుపు ఉబ్బిందని వ్యక్తి కుంటలో పడి నాలుగైదు రోజులు అయి ఉంటుందని తెలిపారు,బూడిద కలర్ పూలచోక్క,ఎర్ర డ్రాయర్ ధరించి ఉన్నాడని ఈమేరకు కేసును నమోదు చేసుకుని శవాన్ని ఫోస్టు మార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వాస్పత్రి తరలించినట్లు హెడ్ కాన్సిటేబుల్ నాయక్ తెలిపారు.

## పెస్ట్ కంట్రోల్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వండి

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్రిమి కీటకాలు, చెదలు పట్టిన వాటిని శుభ్రంగా ఉంచుతున్న పెస్ట్ కంట్రోల్ ఉద్యోగులకు మూడు నెలల నుండి జీతాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబాలు జరుగక ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మా సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా మారెప్ప ఎన్నిక



**హొళగుంద,మేజర్‌న్యూస్ :** సిపిఐ మండల కార్యద ర్శిగా రెండో సారీ పెద్దహ్యాట మారెప్పను ఆ పార్టీ నాయకులు ఎకగ్రీవంగా ఎన్ను కున్నారు.ఆలూరు నియోజికవర్గ పార్టీ 12వ మహాసభ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య సమీక్షంలోమారెప్పను మండల కార్యదర్శిగా ఎన్నుకుమ్మారు.ఆదేవిధంగా సహాయ కార్యదర్శిగా రంగన్నను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి క్రిష్ణయ్య,వెంకన్న,నూర్‌బాష, మస్తాన్‌వలి,యూసూబ్, జాయిదమ్మ,భూలక్ష్మి,వనజమ్మబసమ్మకాజమునిహర్షం వ్యక్తం చేశారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ఆదోని, మేజర్ న్యూస్ : ఆదోని పట్టణంలోని వైఎంకె హైస్కూలులో 10వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పూర్వ విద్యార్థులు ఎం.బి. రఘు, సుధాకర్, నాగరాజులు పేర్కొన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ, 1999-2000 బ్యాచ్ 10వ తరగతి సి సెక్షన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునీలు, విద్యార్థినీ విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## నంద్యాల రైల్వే స్టేషన్‌లో పోలీసుల ఆకస్మీక తనిఖీలు



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** గంజాయి అక్రమ రవాణా నిర్మూలనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఈగల్ టీం ఐజి రవికృష్ణ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచనలతో నంద్యాలలోని రైల్వే స్టేషన్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ-హుబ్లీ ప్యాసెంజర్ రైలుతో పాటు నంద్యాల రైల్వే స్టేషన్‌లో వెయిటింగ్ హాల్, పార్సిల్ కార్యాలయం, క్యాంటిన్‌లలో తనిఖీలు నిర్వహించారు. డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాల గురించి సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 1972కు లేదా స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ తనిఖీల్లో అడిషనల్ ఎస్పీ అడ్మిన్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సూర్యమౌళి, ఈగల్ టీం సిబ బంది, స్పెషల్ టీం సబ్ ఇన్‌స్పెక్టర్లు గంగయ్య యాదవ్, కుమారి, ఆర్పిఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యారత్ వేడుకలు



**సంజామలమేజర్,న్యూస్:** సంజామల మండలం ఆల్వకొండలో శుక్రవారం రాతిర దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి వార్ల జ్యారత్ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వారికి గ్రామ ప్రజలు, పెద్దలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిఇ పూల చద్దర్‌లు, దట్టీలు సమర్పించి ఫాతేహాలు సమర్పించారు. రాత్రి దస్తగిరి స్వామి, మౌలాలి స్వామి పీర్లను అలంకరించి ఫాతేహాలు అనంతరం శనివారం వేకువజామున గ్రామంలో తిప్పి ఇంటింటి వద్ద దస్తగిరి స్వామి, మౌలాలి స్వామిలకు భక్తులు పూజలు నిర్వహించారు.

## ధర్మవరం మన్నె సుబ్బారెడ్డికి తప్పిన ప్రమాదం




**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి కార్పోరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డికి ప్రమాదం తప్పింది. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం ఆదోనికి వెళ్తున్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి వాహనాన్ని పత్తికొండ దగ్గర ఒక ఆటో ఢీ కొట్టడం జరిగింది. అయితే ప్రమాదంలో ఎవ్వరికి ఎటువంటి గాయాలు కాలేదు. అనంతరం మరొక వాహనంలో ధర్మావరం మన్నె సుబ్బారెడ్డి ఆదోనికి బయలుదేరారు.

## క్షేత్రస్థాయిలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల తనిఖీ చేపట్టాలి



డిఈఓకు వినతిపత్రం అందచేస్తున్న జేఏసి నాయకులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** ఆర్టీఈ విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ విద్యార్థి సంఘాల జెఏసి నాయకులు కోనేటి వెంకటేశ్వర్లు, పగడాల ఆనంద్ బాబు, ఎద్దుపెంట అంజి, బాలక్రిష్ణ వాల్మీకి, ఎం హరిక్రిష్ణ, కిరణ్ కుమార్‌లు జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్‌ను కోరారు. శనివారం నగరంలోని డిఈఓ కార్యాలయంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిఈఓ శామ్యూల్‌పాల్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఫిట్‌నెస్ లేని బస్సులు వినియోగించడం వల్ల ఉమ్మడి జిల్లాలో నిత్యం స్కూల్ బస్సుల ప్రమాదాలు జరిగి విద్యార్థులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రైవేటు పాఠశాల తనిఖీ చేపట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పాఠశాలలను సీజ్ చేయాలని కోరారు.

## గ్రామ కమిటీలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



గ్రామ కమిటీని ఎన్నుకున్న వైసిపి నాయకులు

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** గ్రామ కమిటీలు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని వైసిపి మండల కన్వీనర్ పేరపోగు మోహన్‌బాబు, వైస్ ఎంపిపి నెహమ్యలు అన్నారు. కోడుమూరు నియోజకవర్గ మాజీ కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, సమన్వయకర్త, కోడుమూరు ఇంచార్జ్ ఆదిమూలపు సతీష్ ఆదేశాల మేరకు శనివారం పేరపోగు మోహన్‌బాబు, నెహమ్యలు మండలంలోని నిర్జూరు గ్రామానికి వెళ్లి ఆ గ్రామ సర్పంచ్, వైసిపి నాయకులు, కార్యకర్తలను కలిసి గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ కమిటీ వేయడం జరిగింది. గ్రామ అధ్యక్షులుగా బి తిరుపతి రెడ్డిని ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శులుగా కె సంతప్ కుమార్, కె శ్రీరాములు, టి రామ్‌రెడ్డి, ఎం ప్రసాద్, ఎస్ మహబూబ్ పీర బాషా, కె నాగులు, బి మోహన్‌బాబు, ఎస్ అల్లావులి, కె లాలు, ఎం ఎల్లప్ప, బోయ బీచుపల్లి, బోయ చిరంజీవి, ఎం నాగన్నలను ఎన్నుకున్నారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

## ఘనంగా 44వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు




మొక్కలు నాటుతున్న అధికారులు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** వాటర్‌షెడ్ కమిటీ, సొసైటీ ఫర్ రూరల్ అండ్ ఎకో డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో 44వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించుకున్నట్లు కలచట్ల గ్రామ సర్పంచ్ పేర్కొ న్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, వాటర్ షెడ్ ట్రెజరర్ రవిలు మాట్లాడుతూ నాబార్డ్ రైతులకు గ్రామీణ ప్రాంతాలకు చేస్తున్న ఆర్థిక సహాయాన్ని అందిస్తూ వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తుందని, వాటర్‌షెడ్ నందు పొలం, వాగులు యందు పనులు, సిసిఏ ఆక్టివిటీ కింద, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, ట్యాంకర్లు, వ్యవసాయ పనిముట్లు మంజూరు అయ్యాయన్నారు. జీవనోపాధుల కింద వివిధ రకాల యూనిట్లకు లోన్లు ఇవ్వడం జరిగిందని, మన గ్రామానికి ఇంతటి సహాయ సహకారాలు అందిస్తున్న నాబార్డ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పిఎఫ్ఎస్ సిబ్బంది, ఇంజనీర్ రాకేష్‌వర్మ, మేనేజర్ సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ ఈశ్వర్, కమిటీ సభ్యులు, రైతులు పుల్లయ్య, పెద్దయ్య, భీమన్నలు హాజరైయ్యారు.

## స్మార్ట్ మీటర్లు వద్దని ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి




**ప్యాపిలి, మేజర్‌న్యూస్:** అడ్డదిడ్డంగా పాలకవర్గాలు ప్రజలపై విద్యుత్ భారాలను మోపుతున్నాయనీ, ప్రజలను చైతన్యపరిచి వాటిని తిప్పి కొట్టాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దంటూ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని సిపిఎం నాయకులు చిన్నరహిమాన్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో లక్ష్మణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం నాయకులు చిన్నరహిమాన్, రామాంజినేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ద్వారా ప్రజల మెడలకు ఉరితాళ్లు బిగించే ప్రయత్నం చేస్తోందన్నారు. వ్యాపార సముదాయాలకు ఇప్పటికే స్మార్ట్ మీటర్లను బిగించడం పూర్తి చేసిన ప్రభుత్వం, 200 యూనిట్లు పైబడి విద్యుత్ బిల్లు వచ్చే గృహ వినియోగదారులకు ఈ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు కుట్ర పన్నుతోందన్నారు. కావున ప్రజలకు విద్యుత్ భారం మోపేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వంపై ప్రజలు, కార్మికులు తిరగబడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల నాయకులు రంగస్వామి, పట్టణ నాయకులు శ్రీనివాసులు, ఇలియాజ్, రవి, నాగేంద్ర, రాజు తదితరులు పాల్గొన్నారు.

# చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకండి..

## – జిల్లా పంచాయితీ అధికారి జి.భాస్కర్



చెత్త సేకరణ కేంద్రం వద్ద అధికారులు

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసి, అనారోగ్యాలకు గురికాకూడదని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యకరంగా జీవిస్తామని జిల్లా పంచాయితీ అధికారి జి.భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 3, 4, 10వ వార్డులలో ఐవిఆర్ ఫోన్ కాల్స్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా జిల్లా పంచాయితీ అధికారి జి.భాస్కర్ వార్డులలోని ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్తను సేకరించే రిక్షాలు, ట్రాక్టర్‌లలో వేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పార్వతయ్య వంక దగ్గర ఉన్న సంపుని ఆయన సందర్శించి పరిశీలించారు. గ్రామంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటి ఎంపిడిఓ, పంచాయితీ కార్యదర్శిలను ఆదేశించారు. అనంతరం నక్కలతిప్ప దగ్గర ఉన్న చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వర్మీ కంపోస్ట్ తయారీ, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఓ రవికిషోర్, పంచాయితీ కార్యదర్శి కె.లక్ష్మినాథ్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలకు బి.సి రాజారెడ్డికి ఆహ్వానం

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డిని ఆలయ అభివృద్ధి కమిటి ఛైర్మెన్ పి.వి కుమార్ రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాస రెడ్డిలు ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించారు. ఈ నెల 24వ తేదీ అమ్మవారి జయంతి సందర్భంగా ఉదయం 6గంటలకు మహామంగళహారతి 7గంటలకు గణపతి పూజ, శ్రీ చక్రాభిషేకం, సహస్ర కుంకుమార్చన, ఛండీ హోమం, వేద పారాయణం, మధ్యాహ్నం 12ః30గంటలకు మహా నివేదన హారతి భక్తులు తీర్థప్రసాదా వితరణ సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ , సహస్ర దీపోత్సవ సేవ, రాత్రి 8గంటలకు మహా మంగళహారతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ



కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ప్రదీప్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు, లక్ష్మి రెడ్డి, కాపులపల్లె సర్పంచ్ తులసి రెడ్డి, పాల్గొన్నారు.

# డా. కిశోర్‌కు సన్మానం



డా. కిశోర్‌ను సన్మానిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహితీ ప్రతినిధులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** తెలుగు బాష వ్యాప్తికి, పరిరక్షణకు కృషి చేసిన నంద్యాల ర చయిత, దంత వైద్యుడు కురుమేటి కిశోర్ కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహితీ ప్రతినిధులు సన్మానించారు. శనివారం కర్నూలు తెలుగు బాషా వికాస ఉద్యమం రాష్ట్రస్థాయి సమావేశం టిజివి కళా క్షేత్రంలో నిర్వహించారు. పత్తి ఓబులయ్య, కల్కూర చంద్రశేఖర్‌లు మాట్లాడుతూ తెలుగుభాషాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. తెలుగు బాషను మరిస్తే తల్లిని మరచినట్లేనన్నారు. తెలుగు సాహితీ ప్రియులను, రచయితలను సన్మానించుకోవడం మన ప్రథమ కర్తవ్యంగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఆర్‌కె శర్మ, పార్వతి, ఖండే సునీత, తదితరులు పాల్గొన్నారు.

# టీడిపీ కోసం అందరు కలిసికట్టుగా పని చేయండి



**హొళగుంద,మేజర్ న్యూస్ః** తెలుగుదేశం పార్టీ కోసం అందరు కలిసికట్టుగా పనిచేయాలని ఆలూరు నియోజికవర్గ పార్టీ ప్రోగ్రాం కోర్డినేటర్,ఆర్టీసీ రీజనల్ బోర్డు ఛైర్మన్ పూల నాగరాజు,కర్నూల్ జిల్లా పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు అన్నారు .సుపరిపాలన తోలి అడుగు కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల నాయకులు,కార్యకర్తలతో శనివారం స్థానికంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పూల నాగరాజు ప్రతి ఒక్క కార్యకర్తలతో ప్రత్యేకంగా మాట్లాడారు.వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పార్టీ కోసం పని చేస్తున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీలు ఇచ్చారు.మండలంలోని రోడ్లు,రవాణా సౌకర్యాలు,ఆరోగ్య,విద్యా సమస్యల అంశాల గురించి చర్చించారు.ఆదేవిధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలో విజయాబికి ప్రతి ఒక్క కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వాల్మికి ఫెడరేషన్ ఛైర్మన్ బుజ్జమ్మ,భర్త రామచంద్రరెడ్డి,మండల నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

## ః– కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ ః** రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యమని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు అన్నారు. డిఐజి, ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లావ్యాప్తంగా ఉన్న ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసులు ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. బైక్‌లు నడిపేవారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్ స్పీడ్, ఓవర్ లోడ్‌తో వాహనాలు వెళ్లకుండ, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# సుపరిపాలన కూటమికే సాధ్యం



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** సుపరిపాలన కూటమి ప్రభుత్వానికి సాధ్యమవుతుందని 21వ వార్డు అధ్యక్షులు హుస్సేన్ పీరా, మన్సూర్ భాషలు పేర్కొన్నారు.ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక 21వ వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాది పాలనలో ప్రభుత్వం ఏమి చేసిందో ప్రజలకు వివరించడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిందని, ఏడాదిలోనే రాష్ట్ర అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తల్లికి వందనం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అంత మందికి ఇచ్చిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కమిటీ సభ్యులు జగదీష్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహాసభలను జయప్రదం చేయండి.....

## రాష్ట్ర బీసి సంక్షేమ యువజన సంఘం అధ్యక్షులు చల్లా అనుదీప్



**ప్యాపిలి, మేజర్‌న్యూస్ :** ఈనెల 17వ తేదిన విజయవాడలో జాతీయ బీసి సంక్షేమ సంఘం అధ్యక్షులు లకా వెంగళరావుయాదవ్ ఆధ్వర్యంలో తలపెట్టిన జాతీయ బీసి సంక్షేమ సంఘం మహాసభలను జయప్రదం చేయాలని యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా అనుదీప్ శనివారం పట్టణంలోని తన కార్యాలయంలో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాతీయ బీసి సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు చల్లా అనుదీప్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఓబీసిలను ఒక్కతాటిపైకి తెస్తూ విజయవాడ కేంద్రంగా నిర్వహిస్తున్న మహాసభలకు కేంద్ర మంత్రులతో పాటు అతిరథ మహారధులు హాజరౌతున్నారని, కావున ఈ మహాసభలను జయప్రదం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఓబీసిలను ఉద్దేశించి అన్నారు. ఓబిసిల హక్కుల సాధనకై జరుగుతున్న ఈ మహాసభలకు ఓబిసి సోదరులంతా బాధ్యతగా పాల్గొనాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కిష్టిపాడు చంద్ర, పి.వెంకటేష్, దూదేకుల మమ్మద్‌రఫీ, పచ్చ చంద్రశేఖర్‌యాదవ్, షేక్‌మస్తఫా, మంగలి రాజు, బోయ తిమ్మరాజు, కటిక రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు. 12డిఎన్‌ఇ03ః మహాసభల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న చల్లా అనుదీప్, నాయకులు

# విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు చేపట్టండి – డివైఎఫ్ఐ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ సెలవు దినాలు, ఆదివారాల్లో ప్రైవేట్ విద్యా సంస్థలు ప్రత్యేక క్లాసుల పేరిట విద్యార్థులను, టీచర్లను మానసిక వేదనకు గురి చేస్తున్నారని, వెంటనే వారిపై చర్యలు చేపట్టాలని డివైఎఫ్ఐ నంద్యాల పట్టణ కార్యదర్శి శివ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లాసుల పేరుతో విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను లెక్క చేయకుండా క్లాసులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే టీచర్లను కూడా తొలగిస్తామంటూ వేధిస్తున్నారన్నారు. ఇప్పటికైనా విద్యా శాఖ అధికారులు ఈ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. లేని పక్షంలో విద్యార్థులతో కలసి ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నాగన్న, హరిష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం డ్యాం రెండు గేట్లు మూసివేత

(మొదటిపేజి తరువాయి..)

ఆంధ్ర పరిధిలోని జల విద్యుత్ కేంద్రంలో 17.382 మిలియన్ యూనిట్లు, తెలంగాణ పరిధిలోని జల విద్యుత్ కేంద్రంలో 17.436 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.వరద ప్రవాహం తగ్గితే తెరచిన ఆ ఒక్క గేటునను కూడా మూసివేస్తామని,ఒకవేళ ప్రవాహం పెరిగితే మరో రెండు గేట్లను ఎత్తివేసే అవకాశం ఉన్నట్లు డ్యామ్ అధికారులు తెలిపారు.



సూర్య www.suryaa.com



# బుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో హుండీలు చోరీ



హుండీలో డబ్బును కాజేసి ఖాళీ హుండీలను పడేసిన దృశ్యం



హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** దేవుడనే భయం భక్తి లేకుండా దొంగలు చెలరేగిపోతున్నారు. మండల పరిధిలోని కాల్వ బుగ్గలో వెలసిన శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి ఆలయంలోని కానుకల 5హుండీలను దొంగలు చోరీ చేశారు. తాళాలు పగలగొట్టి హుండీలను దొంగలు ఎత్తుకెళ్లే సీన్ మొత్తం సిసి కెమెరాలలో రికార్డు అయ్యింది. శుక్రవారం అర్థరాత్రి ఇద్దరు దొంగలు ముఖానికి మాస్క్ వేసుకొని స్వామి, అమ్మవార్ల గర్భగుడి తలుపులను పగలగొట్టి ఆలయంలో ఉన్న ఐదు హుండీలను ఎత్తుకెళ్లారు. ఎత్తుకెళ్లిన హుండీలను చిన్నకోనేరు సమీపంలో పగలగొట్టి అందులో ఉన్న నోట్లను మాత్రమే తీసుకుని చిల్లర అక్కడే వదిలేసి వెళ్లారు. ఆలయ పూజారులు ప్రతిరోజు మాదిరే స్వామి వారి పూజ కైంకర్యాల కోసం ఆలయానికి చేరుకోగా అప్పటికే ఆలయం గేటు పగలగొట్టి ఉండడం చూసి ఆలయ ఈఓకు సమాచారం అందివ్వగా సమాచారం అందుకున్న ఈఓ ఆలయానికి చేరుకుని పరిసరాలను, సిసి కెమెరాలను పరిశీలించి హుండీలు చోరీకి గురైనట్లు గుర్తించి ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం భక్తులు సమర్పించిన కానుకలను దుండగులు దోచుకెళ్లారని ఈఓ తెలిపారు. ఆలయ ఈఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆలయానికి చేరుకొని క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. ఇళ్లతో పాటు దేవాలయాలను వదలకుండా తరచూ దొంగతనాలను చేస్తూ పోలీసులకు దొంగలు సవాల్ విసురుతున్నారు. దీంతో ప్రజలు, భక్తులు దేవుని ఆలయానికి కూడా రక్షణ లేకుండా పోయిందని భయాందోళన చెందుతున్నారు. పోలీసులు వీలైనంత త్వరగా దొంగలను పట్టుకోవాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.

# తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది

**– ప్రయోజనకరంగా తెలుగు భాషా పరిరక్షణ సదస్సు**



తెలుగు తల్లికి పూలమాలలు వేసిన డిఎస్పీ తదితరులు

**కర్నూలు కల్చరల్, మేజర్‌న్యూస్ :** తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది అని విశ్రాంత ఐఎఎస్ ముక్తేశ్వర్ రావు, తూమాటి సంజీవరావులు అన్నారు. నగరంలోని టీజీవి కళాక్షేత్రంలో తెలుగుభాషా పరిరక్షణ సదస్సు మొదటిరోజు శనివారం చాలా ప్రయోజనకరంగా జరిగింది. ఈ సదస్సుకి కురాడి చంద్రశేఖర్ కల్కురా అధ్యక్షత వహించగా పత్తి ఓబులయ్య సంచాలకులుగా, ఉపాధ్యక్షులుగా శర్మలు వ్యవహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథులుగా ముక్తేశ్వర్ రావు, తూమాటి సంజీవరావులు హాజరయ్యారు. 26జిల్లాల ప్రతినిధులు, రచయితలు, అధ్యాపకులు, విద్యార్థులు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి కొండారెడ్డి బురుజు నుండి ఎన్‌టిఆర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. తెలుగు అధికార భాషగా అమలు చేసుకుందాం, పాలనలో, బోధనలో, న్యాయస్థానాలలో ప్రథమ భాషగా తెలుగును అమలు జరపాలని ప్రతినిధులు తమ ప్రసంగాల్లో మాట్లాడారు. బ్యాంకులతో పాటు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అమలు చేయాలన్నారు. అనంతరం నంది వెలుగు ముక్తేశ్వరరావు రచించిన అప్పుడు రాష్ట్రం కోసం..ఇప్పుడు భాష కోసం..అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కార్యదర్శి దండెబోయిన పార్వతీదేవి, డిఎస్పీ మహబూబ్ బాష, సుబ్బలక్ష్మమ్మ, రచయిత అజీజ్, వివిధ రంగాలకు చెందిన సాహితీ సేవకులు పాల్గొని విజయవంతం చేశారు. నేడు తెలుగు భాషను ఎలా కాపాడుకోవాలి వివిధ చర్చనీయాంశాలపై చర్చలు జరిపి తీర్మాణాలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. సభకు భాష ప్రముఖులు, రచయితలు, పండితులు, కార్యకర్తలు హాజరయ్యారు.



ర్యాలీగా వస్తున్న భాష ప్రముఖులు, రచయితలు, ప్రజలు



మాట్లాడుతున్న వక్తలు

# ఆయుర్వేద వైద్యశాలకు వైద్యుడు లేడా?



ఖాళీగా ఉన్న ఆయుర్వేద వైద్యుడి కుర్చీ

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఆయుర్వేద వైద్యశాలకు వైద్యుడు లేడా అని వైద్యం కోసం వస్తున్న ప్రజలు చర్చించుకుంటున్నారు. గత కొంతకాలంగా ఈ విభాగానికి వైద్యుడు లేడని ఆ విభాగంలోని కింది స్థాయి అధికారి తెలిపారు. ఈ విభాగానికి సీనియర్ మెడికల్ ఆఫీసర్ కావాల్సి ఉంది. ఇంచార్జ్‌గా డాక్టర్ స్వర్ణలతను నియమించారు. వారు మంగళ, గురు, శని వారాల్లో సి క్యాంపు నందు గల పట్టణ ప్రాథమిక కేంద్రంలో విధులు నిర్వహిస్తారు. మిగతా రోజులు ఎమ్మిగనూరులో విధులు నిర్వహిస్తారు. అయితే జిల్లాలోని ప్రతి వ్యక్తికి ఉచిత వైద్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రి నందు ఆయుర్వేద వైద్యశాలకు రెగ్యులర్ వైద్యుడు లేకపోవడంతో జిల్లాలోని మారుమూల గ్రామాల నుండి వైద్యం కోసం వచ్చే రోగులు నిరాశతో వెనుదిరిగిపోతున్నారు. ఈ విభాగానికి సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకుని సీనియర్ మెడికల్ ఆఫీసర్‌ను నియమించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ట్యూషన్ మాస్టర్ సంజీవ రెడ్డి ఆత్మహత్య

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ :** బనగానపల్లె పట్టణంలో నవోదయ , సైనిక్ స్కూల్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణనిచ్చే ట్యూషన్ మాస్టర్ సంజీవ రెడ్డి శనివారంనాడు పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకున్నారు. బత్తూలూరుపాడు గ్రామానికి చెందిన సంజీవ రెడ్డి బనగానపల్లె పట్టణంలో నివాసం ఉంటూ విద్యార్థులకు ట్యూషన్ చెప్పేవాడు అయితే శనివారంనాడు బత్తులూరుపాడు సమీపంలో పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకోవడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామ నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని మృతికి ఆర్థిక సమస్యలే కారణమని స్థానికులు చెబుతున్నారు.



మృతి చెందిన సంజీవ రెడ్డి

# అహోబిలంలో గాయకుడు విజయ ప్రకాష్ పూజలు



**ఆళ్లగడ్డ, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని ప్రముఖ గాయకుడు విజయ్ ప్రకాష్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఎగువ దిగువ క్షేత్రాలలో కొలువైన లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఎగువ అహోబిలం మణి యార్ సుదర్శన్ వారికి ఆలయ విశిష్టతను వివరించారు. దర్శనానంతరం వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఏడాదిలోనే 80 శాతం హామీలు అమలు

**– కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు**



మాట్లాడుతున్న కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 80 శాతం హామీలు అమలు చేసిందని కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని 42వ వార్డు ఇంచార్జ్ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో చల్లవారి వీధి మొదటి లైన్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుడా ఛైర్మన్ సోమిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కొరకు సిఎం చంద్రబాబు అహర్నిషలు శ్రమిస్తున్నాడన్నారు. కాలనీల్లో ఏవైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తెదేపా నగర అధ్యక్షులు నాగరాజు యాదవ్, నాయకులు నంద్యాల నాగేంద్ర, సోమిశెట్టి నవీన్, సత్రం రామకృష్ణ, వలీ, సురేఖ, విజయ భారతి, షేక్ హనీమున్నీ తదితరులు పాల్గొన్నారు.

# బాబూ షూరిటీ.. మోసం గ్యారెంటీ

**– మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి**



పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** వెలుగోడు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను కరపత్రాలకే పరిమితం చేసిందని అన్నారు. ప్రజలకు హామీలు అమలు కావడం లేదని అన్నారు. ప్రజలను, రైతులను మోసం చేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిరుద్యోగులు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటానని అధైర్య పడవద్దని ఆయన భరోసా ఇచ్చారు. శ్రీశైలం నియోజకవర్గ వైసీపీ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, జిల్లా జడ్పీటీసీ కోఆప్షన్ మెంబర్ ఇలియాస్ ఖాన్, సర్పంచ్ జయపాల్, రేగడగూడూరు నాయకులు దేశం తిరుపం రెడ్డి, తెలుగు రాజు, వైస్ ఎంపీపీ చికెన్ బాబు, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# భాజాపా నాయకుడిపై కానిస్టేబుల్ దాడి

**– పోలీస్ స్టేషన్‌కు చేరిన పంచాయతీ**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** కర్నూలు జిల్లా కేంద్రంలో బిజెపి యువ నాయకుడు మధుగౌడ్‌పై కానిస్టేబుల్ రఫిక్ దాడి చేసి గాయపరచడంతో ఇరువర్గాల పంచాయతీ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వివరాల మేరకు బిజెపి యువ నాయకుడు మధుగౌడ్‌పై సంతోష్ నగర్‌లో ఇంటి పక్కనే ఉన్న కానిస్టేబుల్ రఫిక్ అతని అనుచరులు దాడికి దిగారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మధుగౌడ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శనివారం తాలుక పోలీస్‌స్టేషన్‌లో మధుగౌడ్ ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోకపోవడంతో బిజెపి నాయకులు గోవర్ధన్ నాయుడు, కరణం నరేష్‌లు స్టేషన్ వద్దకు వెళ్లి బిజెపి యువ నాయకుడిపై దాడి జరిగినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించడంతో తాలుక సిఐ శ్రీధర్ మధుగౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ రఫిక్, మౌలాలితో పాటు మరో ముగ్గురిపై దాడి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం బిజెపి నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థలో ఉండి ప్రజా సేవ చేయాల్సిన వ్యక్తి అవినీతి, రాజకీయ కక్ష్యలకు పాల్పడడమంటే ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు. కానిస్టేబుల్ రఫిక్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. వీరి వెంట బిజెపి స్టేట్ కౌన్సిల్ మెంబర్ పూస మల్లికార్జున, ఓబిసి మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజి, యువ రాజు తదితరులు వున్నారు.